ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శనివారం 28 జూన్ 2025



స్వయం సహాయక సంఘాలకు రుణాలు

సీతానగరం, జూన్27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు వివిధ రకాల వృత్తుల్లో శిక్షణ ఇచ్చి, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని వెలుగు శ్రీనిధి జిల్లా ఏజీఎం పి.కామరాజు తెలిపారు. శుక్రవారం సీతానగరం వెలుగు సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. 2025-26లో జిల్లా రుణాల లక్ష్యం రూ.86 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.9.20 కోట్లు పొదుపు సంఘాలకు ఇచ్చామన్నారు. అర్హులైన సభ్యులకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు, మండల సమాఖ్య సభ్యులు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జయ జయ జగన్నాథ

- రథయాత్ర ఉత్సవాలు ప్రారంభం
- స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పార్వతీపురం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం రథయాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రథయాత్ర సాగింది. అంతటా జై జగన్నాథ నామస్మరణ మార్మోగింది. శుక్రవారం పలు ఆలయాల్లో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయంలో పూజలు అయ్యాక స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై వేంచేయించారు. జిల్లా కేంద్రంలో దంగడి వీధిలోని ప్రధాన ఆలయం వద్ద స్వామివారికి విశేష పూజలు చేశారు. పట్టణవాసులు జగన్నాథుడిని దర్శించుకుని పులకించి పోయారు. అనంతరం పాతబస్టాండ్ కూడలి వద్ద



రథంపై ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

నుంచి గుడించా మందిరం వరకు జగన్నాథ రథోత్సవం కనుల పండువగా సాగింది. జై జగన్నాథ్ అంటూ భక్తులు రథం వెంట నడిచారు. గుడించా మందిరంలో వచ్చే నెల 5వ తేదీ వరకు స్వామివారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఈవో ప్రసాద్ తెలిపారు. ఈనెల 1న హీరాపంచమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మారురథయాత్ర రోజున జగన్నాథ స్వామిని తిరిగి ప్రధాన ఆలయానికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

స్వామిని దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు

జిల్లా కేంద్రంలో రథయాత్ర ప్రారంభానికి ముందు స్వామి వారిని మంత్రి అచ్చెన్నాయుడు దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. అనంతరం రథాన్ని లాగి అందరినీ ఉత్సాహపరిచారు. ఆయన వెంట పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తదితరులున్నారు.



పూర్తి కథనాలు.. 6లో



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు.. పక్కన మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

మన్యాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

పార్వతీపురం, జూన్27(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం.. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మన్యాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం..' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో సుపరిపాలన 'తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మన్యం జిల్లా జీడీపీ చాలా బాగుంది. జిల్లా ఏర్పడిన నాటికి జీడీపీ 12.06 శాతం ఉంటే.. 2023-24లో 16.94 శాతం వృద్ధి సాధించింది. ఈ ప్రాంతంలో పనిచేసేందుకు ఉద్యోగులు ఆసక్తి చూపడం లేదు. ఇకపై బదిలీలు జరిగితే వారి స్థానంలో వేరే అధికారి చేరిన తర్వాతే పాతవారిని రిలీవ్ చేయాలని అధికారులను ఆదేశించాం. ఇక్కడ జీడి దిగుబడి బాగా ఉంది. అందుకే జిల్లా ప్రధాన కేంద్రంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం గొప్ప విషయం. అందుకే ఈ జిల్లాలో మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ కార్యక్రమాన్ని నిర్వహించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో అన్ని రోడ్లకు మరమ్మతులు చేపట్టాం. గిరిజన గ్రామాలకు తారు రోడ్లు నిర్మించాం. డోలీ మోతలు లేకుండా చేశాం. జంఝావతి, కొఠియాకు సంబంధించి ఒడిశాతో ఉన్న సమస్యలు పరిష్కరిస్తాం.' అని మంత్రి వెల్లడించారు.

జిల్లాకేంద్రం రూపురేఖలు మార్చాలి..

'గ్రామీణ వాతావరణం తలపించేలా జిల్లా కేంద్రం ఉంది. పార్వతీపురం పట్టణ రూపురేఖలు మార్చాలి. రోడ్లు, పార్కులు, పచ్చదనం కనిపించేలా అభివృద్ధి చేసుకోవాలి. జిల్లాలో 38 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నా పూర్తిస్థాయిలో వైద్యులు లేరు. కలెక్టర్ ఆధ్వర్యంలో వైద్యులను నియమించేలా చర్యలు తీసుకుంటాం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా రీసర్వే చేపట్టారు. దీంతో భూ వివరాలు, రికార్డులు సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ రీ సర్వే చేపట్టి వాటిని ప్రక్షాళన చేస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకొచ్చారు. వాటితో త్వరలోనే జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరిస్తాం.' అని మంత్రి తెలిపారు.

రూ.400 కోట్లతో రహదారుల పనులు

మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. 'ప్రతి గిరిజన గ్రామానికి పక్కా రహదారి నిర్మించడమే లక్ష్యంగా

(మిగతా 8వ పేజీలో...)

సమన్వయంతో పనిచేయండి

- అధికారులను ఆదేశించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి

6లో

వైభవంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు



6లో

జీడితోటల్లో ఏనుగులు



6లో

క్రీడలకు మంచిరోజులు

- నూతన విధానం ప్రకటించిన ప్రభుత్వం

6లో

పారిశుధ్యం, తాగునీటిపై

శ్రద్ధ చూపాలి: జడ్పీ సీఈవో

సాలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటిపై శ్రద్ధ చూపాలని ఉమ్మడి జిల్లా జడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ ఆదేశించారు. గతేడాది విజయనగరం జిల్లా గుర్లలో జరిగిన సంఘటన పునరావృతం కారాదన్నారు. శుక్రవారం సాలూరు ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. వర్షాకాలం నాలుగు నెలల పాటు ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీడీవోలు తదితరులు రోజు ఉదయం ఆరు గంటలకే ఒక గ్రామాన్ని పరిశీలించాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, మురుగు కాలువల నిర్వహణపై ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రతి 15 రోజులకు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు చేయించాలన్నారు. సజావుగా చెత్త సేకరణ చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధుల ఖాళీలపై ప్రతి నెలా ఎన్నికల కమిషనర్‌కు వివరాలు పంపిస్తున్నామన్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట్రామన్, డీఎల్‌డీవో కిరణ్‌కుమార్, ఎంపీడీవో పార్వతి తదితరులున్నారు.



ఎంపీడీవోకు సూచనలిస్తున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

ఎమ్మార్సీలకు మోక్షం

- భవనాల నిర్మాణాలకు ప్రభుత్వ ఆదేశం
- రూ.6.89 కోట్లు మంజూరు

గరుగుబిల్లి, జూన్27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మండల వనరుల కేంద్రాల (ఎమ్మార్సీ)కు మోక్షం లభించింది. ఎమ్మార్సీ భవనాల స్థితిపై ఈ నెల 16న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మంత్రి ఆదేశాలతో రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ పీడీ బి.శ్రీనివాసరావు జిల్లాలోని 13 ఎమ్మార్సీ భవనాల నిర్మాణాలు, మరమ్మతులకు రూ. 6.89 కోట్లు మంజూరు చేశారు. సీతానగరం మండలంలోని ఎమ్మార్సీ భవనం మరమ్మతులకు రూ. 20 లక్షలు , మిగిలిన చోట్ల నూతన భవనాల నిర్మాణాలకు ఒక్కో దానికి రూ. 53 లక్షలు చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, మక్కువ, బలిజిపేట, సాలూరు, పాచిపెంట మండలాల్లో నూతన భవన నిర్మాణాలు చేపట్టనున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదేశాలు అందాయి

జిల్లాలోని 13 మండలాల్లో శిథిలావస్థలో ఉన్న ఎమ్మార్సీ భవనాల స్థానంలో నూతన నిర్మాణాలకు ఆదేశాలు అందాయి. ఆయా మండలాల్లో భవనాల పరిస్థితులను పరిశీలించాలని సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఇందు కోసం అవసరమైన డిజైన్లు రూపొందించనున్నాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

- ఆర్.తేజేశ్వరరావు, ఏపీసీ, సమగ్ర శిక్ష అభియాన్, పార్వతీపురం మన్యం



ప్రాజెక్టు నుంచి దిగువకు వరద నీటిని విడుదల చేసిన దృశ్యం

నాగావళికి స్వల్ప వరద

గరుగుబిల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి శుక్రవారం స్వల్పంగా వరద పోటెత్తింది. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పైప్రాంతం నుంచి నదిలోకి సుమారు 900 క్యూసెక్కులు చేరింది. ఈ మేరకు శుక్రవారం అధికారులు స్పిల్‌వే గేట్లు తెరిచి.. దిగువ ప్రాంతానికి సుమారు 750 క్యూసెక్కులను విడుదల చేశారు. ప్రస్తుతం తోటపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వ 105 మీటర్లకు గాను 104.40 మీటర్లుగా ఉంది. ప్రస్తుతం దిగువకు వరద నీరు విడుదల చేయడంతో ప్రజల రాకపోకలకు కొంతమేర అంతరాయం ఏర్పడింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు ఉండవని ప్రాజెక్టు ఈఈ మన్మథరావు తెలిపారు.

పిల్లల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించాలి

- ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

సీఆర్టీల రెన్యువల్‌కు ఆదేశాలు

8లో

ఇలా అయితే.. రాకపోకలు ఎలా?

- బురదమయంగా జగనన్న కాలనీ రోడ్డు
- లబ్ధిదారులకు తప్పని అవస్థలు



8లో

విజృంభిస్తున్న మలేరియా

- మంచం పట్టిన గిరిజన గ్రామాలు
- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరపీడితులు
- పీహెచ్‌సీలు కిటకిట

సీతంపేట రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో మలేరియా విజృంభిస్తోంది. ఏ గిరిజన గ్రామంలో చూసినా కనీసం పది మంది వరకు మలేరియాతో బాధపడుతున్నారు. మర్రిపాడు పీహెచ్‌సీ పరిధిలో ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. తోటగూడ, పీవీ ఈతమానుగూడ, మర్రిపాడు, సవరపాడు, తుంబలి, గ్రామాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారు. ఇక శుక్రవారం సవరపాడుకు చెందిన సవర సౌజన్య, జి.అజిత్, ఎన్.నారాయణ, మండంగి అఖిల్, పత్తిక విశ్వనాథం తదితరులు మర్రిపాడు పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్నారు. తోటగూడ గ్రామంలో సవర లుంబిరి అనే వృద్ధురాలు చలి జ్వరంతో వణుకు తోంది. పీవీ ఈతమానుగూడలో ఆరిక అల్లూరి, సంధ్యారాణిలు జ్వరంతో మంచం పట్టారు.

రోగులకు తప్పని ఇబ్బందులు

మర్రిపాడు పీహెచ్‌సీలో శుక్రవారం ఓపీ సుమారు 45 వరకు ఉండగా వీరిలో జ్వరపీడితులే ఎక్కువ మంది ఉన్నారు. వైద్యాధికారి సత్యవేణి వైద్యాధికారుల సమావేశానికి హాజరయ్యారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యసిబ్బంది సేవలందించారు. ఈ పీహెచ్‌సీకి ఒక్కరే వైద్యాధికారి ఉండడంతో రోగులుకు ఇబ్బందులు తప్పడం లేదు.

వైద్యాధికారులు లేక ...

ఐటీడీఏ పరిధిలోని దోనుబాయి, కుసిమి, మర్రిపాడు పీహెచ్‌సీల పరిధిలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.ఈ మూడు పీహెచ్‌సీల్లో



మర్రిపాడు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మలేరియా జ్వర పీడితులు

ఒక్కొక్కరే వైద్యాధికారులు రోగులకు సేవలందిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల్లో కూడా వారే సేవలందించాల్సి వస్తోంది. మలేరియా కేసులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీలకు అదనపు వైద్యులను నియమించాలని గిరిజనసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పీహెచ్‌సీల్లో అదనపు వైద్యాధికారుల భర్తీ కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపామని డిప్యూటీ డీఎంహెచ్‌వో పి.విజయపార్వతి తెలిపారు. మరికొద్ది రోజుల్లో పోస్టుల భర్తీ జరుగుతుందని ఆమె సమాధానమిచ్చారు.

జై జగన్నాథ



- విజయనగరంలో వైభవంగా తొలి రథయాత్ర
- భారీగా తరలివచ్చిన భక్తులు



దాసన్నపేటలోని నవాబుపేట జంక్షన్‌లో తొలి రథయాత్రలో భక్తుల కోలాహలం

విజయనగరం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మేళతాళాలు, వేద మంత్రోచ్చారణలు... భక్తుల జై జగన్నాథ నినాదాలతో విజయనగరం పులకించింది. జిల్లా కేంద్రంలో జగన్నాథ రథయాత్రను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న జగన్నాథ స్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి రథాల ముందు మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న దాసన్నపేటలోని పురాతన జగన్నాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పైడిమాంబ దత్తత ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, మాజీ కౌన్సిలర్ రౌతు పద్మ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. దాసన్నపేట ఆలయం నుంచి నవాబుపేట జంక్షన్ వరకూ యాత్ర కొనసాగింది. పైడిమాంబ దేవస్థానం ఈవో శిరీష, సూపరిడెంటెంట్ ఏడుకొండలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సంతపేట జగన్నాథ స్వామి, రాజమన్నార్ గోపాలస్వామి, కాళ్లనాయుడు మందిరం రోడ్డు, కర్రల మార్కెట్, చిక్కాలవీధిలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించిన రథయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథ, బలభద్ర, సుభద్రలు



తొలిరథయాత్ర ఉత్సవంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

కదిలిన జగన్నాథ రథ చక్రాలు

- ఘనంగా తొలి దశమి పూజలు ప్రారంభం

పాలకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి దశమి పూజలను భక్తులు వైభవంగా నిర్వహించారు. జగన్నాథస్వామి, బలరాం, సుభద్ర ఉత్సవ విగ్రహాలను రథంపై ఎక్కించి ప్రధాన ఆలయం నుంచి గుడించా మందిరానికి భక్తుల కోలాహలం మధ్య తీసుకెళ్లారు. మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లా కొండలరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● సాలూరు, జూన్27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రథయాత్ర శుక్రవారం కనుల పండువగా జరిగింది. శ్రీమందిరంలో ఉన్న స్వామివారికి ముందుగా ఆలయ అను వంశిక ధర్మకర్త విక్రమచంద్రసన్యాసిరాజు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథం పైకి ఎక్కించి, గుండిచా మందిరానికి యాత్ర సాగించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్వామివారిని దర్శించుకుని, పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), వప్పల మోహనరావు, కౌన్సిలర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

● జియ్యమ్మవలస, జూన్ 27 (ఆంధ్రజ్యో తి): చినమేరంగిలో జగన్నాధుని యాత్ర వైభవంగా జరిగింది. ఆలయ వంశపారం పర్య ధర్మకర్త శత్రుచర్ల వంశీయులు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు మొదటి పూజ నిర్వహించారు. అనంతరం బలభద్రుడు, సుభద్ర, జగన్నాథస్వామి విగ్రహాలను రథంపై భారీ ఊరేగింపుతో గుండిచా మండపానికి తీసుకువచ్చారు.



జామిలో పూజలు చేస్తున్న భక్తులు



జియ్యమ్మవలస: చినమేరంగిలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

జామిలో...

జామి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జామిలో జగన్నాథ స్వామి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

● భామిని, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బత్తిలిలో జగన్నాథస్వామి రథయాత్ర ఘనంగా జరిగింది. ఆలయం నుంచి దేవతా మూర్తులను రథంలో గుండిచా మందిరానికి ర్యాలీగా తరలించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు



సాలూరు: పూజల్లో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి



భామిని: బత్తిలిలో రథాన్ని లాగుతున్న దృశ్యం

వైభవంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు

సాలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వారాహి మాత నవరాత్రి ఉత్సవాలను స్థానిక కామాక్షి అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న వారాహి మాత విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మంత్రజపంను సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ఆలయ వ్యవస్థాపక గురువు ముద్దు సత్యనారాయణ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో భక్తులు జపించారు.



పూజలందుకుంటున్న వారాహిమాత

జీడితోటల్లో ఏనుగులు

సీతంపేట రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని గోరపాడు గ్రామ సమీపంలో గల జీడితోటల్లో నాలుగు ఏనుగులు సంచరిస్తున్నాయి. శుక్రవారం ఉదయం కొండ ప్రాంతంలోని జీడితోటల్లో తిష్టవేసిన ఏనుగులు సాయంత్రానికి కొండపైకి చేరాయి. పెద్దపెద్ద ఘీంకారాలు చేస్తూ జీడితోటల్లోని చెట్ల కొమ్మలను విరిచి నాశనం చేసినట్టు గిరిజన రైతులు తెలిపారు. ఏనుగుల గమనాన్ని అటవీశాఖ అధికారులు, ట్రాకర్లు పర్యవేక్షిస్తున్నారు.



జీడితోటల్లో ఏనుగులు

ఎంఎస్‌ఎంఈ పార్కులో కోకో కోలా

- భూములు పరిశీలించిన సంస్థ ప్రతినిధులు

శృంగవరపుకోట రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిందాల్ భూముల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కులో కంపెనీ స్థాపన కోసం కోకోకోలా సంస్థ స్థలాన్ని పరిశీలించింది. శుక్రవారం సాయంత్రం సంస్థ సీనియర్ మేనేజర్ రాజా రాంఫాయ్, దీపక్‌లు జిందాల్ ప్రాజెక్టు హెడ్ రాచూరి కనకారావు ఆధ్వర్యంలో భూములను చూశారు. తమ సంస్థ కార్యాలయం ఇక్కడ ఏర్పాటుచేస్తే 3 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. వివిధ అంశాలపై జిందాల్ హెడ్‌తో చర్చించారు.



జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్న తదితరులు

సమన్వయంతో పనిచేయండి

- అధికారులను ఆదేశించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

పార్వతీపురం, జూన్27(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై జిల్లా ప్రజా ప్రతినిధులకు సమాచారాన్ని అందిస్తూ.. సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా కృషి చేయాలి. మన్యంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్య ఉంది. కేవలం 50 శాతం మంది మాత్రమే పనిచేయడం వల్ల అభివృద్ధిపై ప్రభావం పడుతుంది. ఈ ప్రాంతంలో వరి దిగుబడి ఎక్కువగా ఉంది. ప్రకృతి సాగు వైపు రైతులను ప్రోత్సహించాలి. రైతు సేవా కేంద్రాలు, ఏఎంసీలు, పీఏసీఎస్‌ల ద్వారా ఎరువులు, విత్తనాలు అందించాలి. జీడిమామిడి, పైనాపిల్ వంటి ఇతర ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించాలి. రానున్న నాలుగు మాసాల్లో పూర్తిస్థాయిలో లస్కర్లను నియమించాలి. జలపాతాలు, ఇతర పర్యాటక ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలి. తోటపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. టీటీడీ లేదా ఇతర నిధులను మంజూరయ్యేలా చూస్తాం. జిల్లాలో ఆసుపత్రుల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేసి వాటిని అందుబాటులోకి రావాలి.' అని తెలిపారు. అంతకుముందు సమాచార శాఖ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల కోసం జైకా నిధులు అవసరమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్న దృష్టికి తీసుకొచ్చారు. వైద్యుల నియామకానికి ఆదేశాలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మలేరియా, డయేరియా ప్రబలకుండా వైద్యాధికారులు ముందుస్తు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ పార్వతీపురంలో కనీస సౌకర్యాలు లేవన్నారు. కార్యాలయాల్లో ఫర్నీచర్, మౌలిక వసతులు, అధికారులు కూడా లేరన్నారు. తోటపల్లి, జంఝావతి సమస్యలను పరిష్కరిస్తే సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించొచ్చని తెపాపారు. కేరళ పైనాపిల్, పత్తి, పామాయిల్ వంటి వాణిజ్య పంటలకు గిరాకీ ఉందన్నారు. మహిళలతో డెయిరీ ఫారాలను ఏర్పాటు చేయించాలని కోరారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ... జీడీపీ వృద్ధి రేటులో రాష్ట్ర స్థాయిలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. గతంతో పోలిస్తే రూ.18000 కోట్లు అదనంగా సమకూరినట్టు తెలిపారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన..

పార్వతీపురం మార్కెట్ యార్డులో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్‌ను మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గుమ్మిడి సంధ్యారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. రూ.74 లక్షలతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను మహిళా సంఘాలు నిర్వహిస్తున్నాయని అధికారులు తెలిపారు.

క్రీడలకు మంచిరోజులు

- క్రీడా వికాస కేంద్రాలకు పూర్వవైభవం
- గత టీడీపీ హయాంలో మంజూరు
- ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ పాలకులు
- నూతన విధానం ప్రకటించిన ప్రభుత్వం



రాజాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన క్రీడావికాస కేంద్ర భవనం

రాజాం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి)

క్రీడల అభివృద్ధికి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన మినీ స్టేడియాలకు (క్రీడా వికాస కేంద్రాలు) మంచి రోజులు రానున్నాయి. క్రీడలను యువత భవిష్యత్తుకు బాటగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే నూతన క్రీడా విధానాన్ని ప్రకటించింది. గత వైసీపీ అయిదేళ్ల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన క్రీడా వికాస కేంద్రాలు ఇక పూర్వవైభవం సంతరించుకోనున్నాయి.

నూతన క్రీడా విధానం..

ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానంలో భాగంగా కీడ్రల కోటాలో ఇచ్చే ఉద్యోగాలను 3 శాతానికి పెంచారు. జాతీయస్థాయిలో స్వర్ణం, కాంస్య, రజత పతకాలు సాధించే వారికి వరుసగా రూ.10 లక్షలు, రూ.5 లక్షలు, రూ.3 లక్షల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఖేల్ ఇండియా, నేషన్ గేమ్స్‌లో రూ.2.5 లక్షలు, రూ.2 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో క్రీడా వనరులను ప్రోత్సహించేందుకు వీలుగా సన్నాహాలు చేస్తున్నారు. తాజా క్రీడా విధానం ప్రకటనతో పునాదుల్లోనే నిలిచిపోయిన క్రీడా వికాస కేంద్రాల పనులు జరుగుతాయన్న ఆశలు క్రీడాకారుల్లో కనిపిస్తుండగా, వారి తల్లిదండ్రుల్లో సైతం పిల్లల్ని ప్రోత్సహించే పరిస్థితి కనిపిస్తోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 2014-19 మధ్య ప్రతి నియోజకవర్గంలో క్రీడా వికాసకేంద్ర నిర్మాణం జరపాలని నిర్ణయించారు. తొలిదశలో ఏడు నియోజకవర్గాలలోని ఆరు ప్రాంతాలలో వికాస కేంద్రాలు, ఒకచోట వాటర్‌సోర్స్ అకాడమీ పనులకు శ్రీకారం చుట్టారు. ఒక్కో కేంద్రానికి రూ. 2 కోట్లు చొప్పున జిల్లాకు రూ.14కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో ఇండోర్ స్టేడియం, పెవిలియన్, 200 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, లాంగ్ జంప్, కబడ్డీ, క్రికెట్ ప్రాక్టీస్ పిచ్, వాలీబాల్ కోర్టు, ఖోఖో ప్రాంగణం వంటివి నిర్మించాల్సి ఉంది. అయితే జిల్లాలో పనులు ప్రారంభమైనా.. 2019 సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడం, ఆ ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో టీడీపీ హయాంలో చేపట్టిన పథకాలకు బ్రేక్ పడింది. గతేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో క్రీడాకారుల్లో కొత్త ఆశలు చిగురించాయి. అందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని ప్రకటించింది.



ఇతర నిర్మాణాల కోసం కేటాయించిన స్థలం

ఎక్కడెక్కడ.. ఎలా..

రాజాం మండలం కంచరాం పంచాయతీలో మాజీ మంత్రి, ప్రస్తుత చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు విద్యుత్‌శాఖ మంత్రిగా ఉన్న కాలంలో క్రీడావికాస కేంద్రానికి 2018 జనవరి 28న శంకుస్థాపన చేశారు. ఓ షెడ్‌తో పాటు మరుగుదొడ్ల కోసం పునాదుల పనులు ప్రారంభం అయ్యాయి. వైసీపీ వచ్చాక గత ఐదేళ్లలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. జిల్లా కేంద్రంతో పాటు బొబ్బిలిలో కూడా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని డెంకాడలో పునాదులకే పరిమితం కాగా, గజపతినగరంలో భూసేకరణ జరగలేదు. చీపురుపల్లి నియోజకవర్గంలో సైతం పనులు శ్లాబ్‌కే పరిమితం అయ్యాయి. తదుపరి నిర్మాణాలపై వైసీపీ ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. తాటిపూడి జలాశయం వద్ద నిర్మించ తలపెట్టిన వాటర్ స్పోర్ట్స్ అకాడమీకి పర్యాటకశాఖ భూమిని సమకూర్చింది. అవసరమైన పరికరాలు సైతం అందుబాటులోకి వచ్చినా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు పడకేశాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే క్రీడాకారులు ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ శ్రీకారం చుట్టిన పనులను అదే ప్రభుత్వం పూర్తిచేసి క్రీడాకారుల కళ్లల్లో కాంతులు నిలుపుతారన్న నమ్మకం వారిలో నెలకొంది.

ప్రభుత్వానికి ప్రతిపాదించాం..

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న క్రీడా వికాస కేంద్రాల పునర్నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎక్కడెక్కడ ఏమేర పనులు జరిగాయి? ఇంకా ఏమేర పనులు పూర్తికావాల్సి ఉంది? అందుకు ఏమేర నిధులు అవసరమవుతాయో ప్రతిపాదించాం. తాటిపూడి రిజర్వాయర్ వద్ద నిలిచిపోయిన వాటర్ స్పోర్ట్స్ పనుల పూర్తికి రూ.5 కోట్లు అవసరమని నివేదించాం.

-వెంకటేశ్వరరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి, విజయనగరం

అనుమతులివ్వకుంటే ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తాం



నినాదాలు చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 'మా న్యాయపరమైన హక్కుల కోసం చేస్తున్న నిరసనకు 48 గంటల్లో అనుమతులు ఇవ్వకపోతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించడంతో పాటు పోలీసుల వ్యవహారంపైనా ఫిర్యాదు చేస్తామ'ని జిందాల్ నిర్వాసితులు హెచ్చరించారు. శుక్రవారం బొడ్డవర గ్రామంలో ఎంపీపీ సోమేశ్వరరావు, ఎస్.కోట సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, గిరిజన, ఎస్సీల పెద్దలు ముత్యాల సన్యాసిరావు, కేత వీరన్నలు మాట్లాడుతూ వారం రోజులుగా రైతులు నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. టెంట్లు తీసేశారని, భోజనాలకు వెళుతుంటే అడ్డుకుంటున్నారని... చివరికి రోడ్డుపైకి వస్తుంటే అరెస్టు చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. రైతులు హక్కుల కోసం పోరాటం చేస్తుంటే కొంతమంది అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని.. వారికి తమ బాధలు ఏం తెలుసని ప్రశ్నించారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి తమ బాధలను వివరిస్తామని తెలిపారు.

డెంకాడ టీడీపీలో భగ్గుమన్న విభేదాలు



టీడీపీ కార్యాలయంలో గుమిగూడిన కార్యకర్తలు

డెంకాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలంలోని తెలుగుదేశం పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. గత కొంతకాలంగా కొనసాగుతున్న వర్గ విభేదాలు శుక్రవారం పరిశీలకుడు కనకల మురళీమోహన్ సమక్షంలో బయటపడ్డాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రామ కమిటీ ఎన్నికల్లో 26 గ్రామ కమిటీలకు 19 గ్రామ కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. డెంకాడ, పెదతాడివాడ, సింగవరం, మోదవలస, చింతలవలస, డి.కొల్లాం, బొడ్డువలస గ్రామాలకు సంబంధించి అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికల విషయంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ వర్గాల నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే నెట్టుకుంటూ... గలాటాకు దిగారు. దీంతో నెల్లిమర్ల పార్టీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పరిశీలకుడు కనకల మురళీమోహన్, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌లు మిగిలిన ఏడు గ్రామ కమిటీ ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, ఫాణిరాజు, ప్రదీప్‌రాజు, విద్యాసాగరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బీమాను వినియోగించుకోండి:జేసీ

విజయనగరం కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని జేసీ సేతుమాధవన్ సూచించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఫసల్ బీమా పథకం కరపత్రాలను శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. వరి, మొక్కజొన్న, నువ్వులు, పత్తి పంటలకు బీమా చేయించుకోవాలని జేసీ సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావు, ఎల్‌డీఎం నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రాప్తికి పనిచేస్తే రూ.307 వేతనం



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్యామలాకుమారి

రేగిడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులు కొలతల ప్రామాణికంగా ఆరుగంటలు పనిచేస్తే వేతనం రూ.307 గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో శ్యామలాకుమారి పేర్కొన్నారు. లచ్చరాయపురంలో కొమటివాని చెరువులో ఉపాధి పనిని ఎంపీడీవో తనిఖీ చేశారు. మస్తర్‌రోల్‌ను పరిశీలించారు. ఒకరికి బదులు ఇంకొకరికి అనుమతించకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ హరనాథ్, ఎఫ్‌ఏ వెంకటరమణ, పంచాయితీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్ ఐటీకి రెడ్‌క్రాస్ ప్రశంసలు

రాజాం రూరల్/రాజాం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రక్తదానం చేసిన సంస్థలలో ప్రథమ స్థానంలో నిలిచిన రాజాం జి.ఎం.ఆర్.ఐ.టి.కి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రశంసించింది. శ్రీకాకుళంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రసాద్ తదితరులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. 401 యూనిట్లు రక్తసేకరణ చేయడం ప్రసంశనీయమని కలెక్టర్ అన్నారని ప్రిన్సిపాల్ డా.ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో కీలకంగా వ్యవహరించిన అసోసియేట్ డీన్ డా.రాంబాబు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి డా. కేవీఎస్‌ప్రసాద్‌కు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, రాజాం శాఖ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్ కుమార్, పెంకి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికను అందుకుంటున్న జీఎంఆర్ ప్రతినిధులు

వినతుల సత్వర పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి వచ్చిన వినతులను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. పోలిపల్లిలోని ఆయన స్వగృహం వద్ద శుక్రవారం అర్జీదారుల నుంచి వినతులు సేకరించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించి ప్రతి ఒక్కరి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో...

భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు శుక్రవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి.. పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్ల రాంబాబు, జన సైనికులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న సిబ్బంది

రాజాం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం గత 52 రోజులుగా వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని యూనియన్ నాయకులు ఆరోపించారు. తక్షణమే మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గొలగాం పంచాయతీలో డీపీవో పరిశీలన



సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న డీపీవో

డెంకాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గొలగాం గ్రామ పంచాయతీలో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి డీవీ మల్లికార్జునరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ తీరుపై ఇంటింటికి వెళ్లి ఆరా తీశారు. పీడబ్ల్యూ ఎస్ ట్యాంకు శుభ్రత, క్లోరినేషన్ తీరును పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించి కార్యదర్శికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కల్పించాలన్నారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీపీఓ వెంట డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గంగాధర్, కార్యదర్శి భారతి, అనూష ఉన్నారు.

శ్మశాన వాటికకు నిధులు మంజూరు చేయండి

చీపురుపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): లావేరు రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌లో పట్టణ పార్టీ అధ్యక్షుడు గవిడి నాగరాజు నేతృత్వంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సీసీ రహదారి, నీటి సౌకర్యం, ప్రహరీ తదితర పనులకు సుమారు రూ.20 లక్షలు అవసరమవుతాయని వారు వివరించారు. ఈ మొత్తాన్ని మంజూరు చేయాలని కోరారు. దీనికి స్పందించిన రామ్‌మల్లిక్ నాయుడు సమస్యను ఎమ్మెల్యే దృష్టిలో పెడతానని, నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, రౌతు కనకరాజు, వివేక్, శేఖర్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు బడి బయట ఉండకూడదు

రేగిడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలు బయట ఉండకూడదని ఎంఈవోలు వరప్రసాదరావు, ఎరకయ్యలు పేర్కొన్నారు. బూరాడ ఎంపీఈ కాలనీ స్కూల్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల రిజస్టర్‌ను పరిశీలించారు. బడికి దూరంగా ఉన్న, ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తేవాలని హెచ్ఎం నాగమణిని ఆదేశించారు.

నూతన కార్యవర్గం

రాజాం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వందేళ్లకు పైగా ప్రాముఖ్యత ఉన్న రాజాం పట్టణంలోని జి.సి.క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెలికాని బదరీనాథ్, కార్యదర్శిగా గురవాన నారాయణరావు, ఉపాధ్యక్షుడిగా పాలవలస శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పొట్నూరు సోమశేఖర్, కోశాధికారిగా పొట్టా సత్యనారాయణ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా మరిశర్ల గంగారావు, నల్లా శ్రీనివాసరావు, గట్టి పాపారావు, చెలకాని సునీల్, చెలికాని శ్రీనివాసరావు, చెలికాని మహేశ్వరరావు, శాసపు కేశవరావు, శీమకుర్తి మోహనరావు, మహదాస్యం బాబ్జి, వాకముళ్ల సురేష్, కో ఆప్షన్ సభ్యులుగా నల్ల రమేష్, పాలవలస శ్యాంసుందర్‌లను ఎన్నుకున్నారు.

వరి విత్తనాల పంపిణీ

డెంకాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెదతాడివాడ గ్రామంలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతుల సమక్షంలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఓ పి.సంగీత మాట్లాడుతూ విత్తనాన్ని శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చన్నారు. ఎంటీయూ 1318 వరి రకంపై అవగాహన కల్పించారు. ఆర్థిక లాభాలను అందించే విత్తనాలను ఉపయోగించేలా రైతులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు పా ల్గొన్నారు.

నీటి వనరుల్లో క్లోరినేషన్

రేగిడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నీటి వనరుల క్లోరినేషన్‌కు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. తోకలవలస, లచ్చరాయపురం పంచాయితీల్లో శుక్రవారం నీటివనరుల క్లోరినేషన్, నిర్వహణ చర్యలను ఆమె పరిశీలించారు. వర్షాకాలంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, క్లోరినేషన్ పనులు చేపడుతున్నట్టు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

రాజాం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జులై 9 నుంచి చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు రాజాం ఎం.ఇ.ఓ. ప్రవీణ్ కుమార్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. యూనియన్ నాయకులు పార్వతి, సునీత తదితరుల ఆధ్వర్యంలో ఎంఈవోను కలిశారు. తమకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలని, రాజకీయ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

న్యూస్ బాక్స్

ఏడుగురు కార్యదర్శులకు మెమోలు

విజయనగరం రింగురోడ్డు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఏడుగురు సచివాలయ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య మెమోలు జారీ చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం తీరును పరిశీలించారు. ప్రజారోగ్య సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరవుతున్నారా? లేదా అన్నది గమనించారు. అనంతరం 24వ నెంబరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రికార్డుల నిర్వహణలో ఏడుగురు కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు గుర్తించారు. వారందరికీ మెమోలు జారీ చేశారు. ఇటువంటివి పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనార్టీ సంక్షేమ అధికారిగా కుమారస్వామికి బాధ్యతలు

విజయనగరం కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యాటక అధికారిగా పని చేస్తున్న కుమార స్వామి జిల్లా మైనార్టీ అధికారిగా శుక్రవారం ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించినట్టు చెప్పారు.

మెప్మా సిబ్బందికి ట్యాబ్‌ల పంపిణీ

విజయనగరం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుక్రవారం తన క్యాంపు కార్యాలయం వద్ద మెప్మా ఆర్‌పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తమ ప్రభుత్వంలో 2017లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిలిపివేసిందన్నారు. తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోందన్నారు.

నేడు మండల సమావేశం

మెరకముడిదాం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.భాస్కరరావు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

మాదకద్రవ్యాలు ప్రమాదకరం

విజయనగరం రింగురోడ్డు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా అత్యంత ప్రమాదకరమని భారతీయ న్యాయ సేవా ఫౌండేషన్ కార్యదర్శి ఈపు విజయ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.బంగారుపాప తెలిపారు. శుక్రవారం న్యాయసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై కస్పా హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వెంకట రమణ, ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు చర్యలు

లక్కవరపుకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థుల ను చేర్పించేందుకు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. సమగ్ర శిక్ష అధికారులు ఎల్.కోట ప్రాథమిక పాఠశాల, ఆర్‌జీపేటలోని యూపీ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు లక్ష్మణరావు, గోపాలకృష్ణ, భారతి, మండల విద్యాశాఖాధికారి కుర్మారావు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

శృంగవరపుకోట జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మేజర్ పంచాయితీ పరిధిలో అధికారులు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ గురించి వివరించారు. సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో అందని తాగునీరు

రాజాం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తాగునీరు అందించేందుకు మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఏఈ, సచివాలయ సిబ్బంది శుక్రవారం ఎంతశ్రమించినా తాగునీరు పూర్తి స్థాయిలో అందించలేకపోయారు. తాగునీటి సరఫరా సిబ్బంది సమ్మెలో ఉండటంతో కమిషనర్ రామప్పలనాయుడు, ఏఈ వెంకటరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది కష్టపడి ప్రయత్నాలు చేసినప్పటికీ అన్ని వార్డులకు తాగునీరు అందించలేకపోయారు. మరో మూడు రోజుల వరకు ఈ ఇబ్బందులు తప్పవని తెలిసింది.

క్రైం న్యూస్

వివాహితపై కత్తిపీటతో దాడి

వేపాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నల్లబిల్లి గ్రామంలో ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన మహిళపై కత్తి పీటతో దాడి చేశాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ... గ్రామానికి చెందిన ఉడత మణికంఠ అనే యువకుడు అదే గ్రామంలోని ఈర్లె సీతారాం ఇంటికి శుక్రవారం వెళ్లాడు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తెంపేందుకు ప్రయత్నించాడు. ఆందోళనకు గురైన సీతారాం కేకలు వేయడంతో మణికంఠ పక్కనే ఉన్న కత్తిపీటతో ఆమెపై దాడి చేశాడు. దీంతో చుట్టు పక్కల ఉన్నవారు వచ్చి- యువకుడిని పట్టుకున్నారు. సీతారాం మెడపై గాయమైంది. తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో ఆమెను చికిత్స కోసం 108లో కె.కోటపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. సీతారాం కుమారుడు శ్రీనువాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి పోలీసులుల కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న లక్కవరపుకోట సీఐ అప్పలనాయుడు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మహిళపై దాడి చేసిన యువకుడు పరారీలో ఉన్నట్టు తెలిసింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వేపాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సంజీవమెట్ట వద్ద ఈ నెల 25న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన మహిళ ముమ్ములూరి సుగుణ (33) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం కోడుగుడ్ల పెంట గ్రామానికి చెందిన ఇ.సుగుణ తన కుమార్తె రజస్వల కార్యక్రమం కోసం అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలో ఉన్న బంధువులకు కార్డులు ఇచ్చేందుకు స్కూటీపై వెళ్లింది. తిరిగి వస్తుండగా సంజీవమెట్ట జంక్షన్ వద్ద ఎదురుగా స్కూటీపై వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు వల్లంపూడి పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త గుల్లుపల్లి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు వల్లంపూడి పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి



మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి/రాజాం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవా రం ఉండవల్లిలోని నివాసంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. ఆర్‌ఈసీఎస్ పునరుద్ధరణ, తోటపల్లి పిల్ల కాలవల నిర్మాణం వంటి సమస్యలపై కూడా ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. యువతకు ఉపాధి కల్పించడం కోసం పరిశ్రమలను స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. తోటపల్లి ప్రధాన కాలువ ద్వారా సాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చీపురుపల్లి రైల్వే వంతెన పనులు పెండింగ్‌లో ఉండటంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని... పనులు సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ప్రతిపాదనల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి



బ్యాగులను పరిశీలిస్తున్న ప్రసాదరావు

గజపతినగరం, జూన్ 27 (ఆంధ్ర జ్యోతి): నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర రాష్ట్ర పరిశీలకులు ఎస్.ప్రసా దరావు అన్నారు. శుక్రవారం మరుపల్లి గ్రామంలో గల కేజీబీవీ, ప్రపోజల్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేసే పుస్తకాలతో పాటు కిట్లును పరిశీలించారు. బ్యాగ్‌ల మన్నికపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు పాఠశాలకు అవసరమైన పుస్తకాలను మాత్రమే తీసుకురావాలని సూచించారు. ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో మెనూను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ ఆదినారాయణ, ఎంఈఓలు ఎస్.విమలమ్మ, చక్రధరరావు పాల్గొన్నారు.

బంగారమ్మతల్లికి పసుపు, కుంకుమ సమర్పణ



అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

వేపాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చామలాపల్లి గ్రామ ప్రజల ఆరాధ్యదేవత బంగారమ్మ తల్లికి శుక్రవారం పసుపు కుంకుమలను సమర్పించారు. ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా దబ్బిరాజుపేట, చామలాపల్లి, పోతుబందిపాలెం గ్రామాల ప్రజలు ఊరేగింపుగా వెళ్లి... అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోలా సతీష్, మాజీ సర్పంచ్ అడపా అప్పలసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములంటే అంత చులకనా?



అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

శృంగవరపుకోట రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో సుజల స్రవంతి కాలువ పేరుతో ఒక ఎకరా రూ.80 లక్షలు ఉన్న భూమిని కేవలం రూ.12 లక్షలకు ఇవ్వాలంటే కుదరదని వీరనా రాయ ణం రైతులు తేల్చి చెప్పారు. భూ సేకరణపై సుజల స్రవంతి డిప్యూటీ కలెక్టర్ కళావతి ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ మూడేళ్లుగా తమను మభ్యపెడుతున్నారని.. కాలువకు భూమి ఇచ్చే ప్రసక్తి లేదని చెప్పారు. మరీ కావాలంటే తమకు ప్రత్యామ్నాయంగా వేరేచోట భూములు చూపించి... ఇక్కడ తీసుకోవచ్చన్నారు. లేని పక్షంలో బహిరంగ మార్కెట్‌లో ఎకరా ధర ఎంత ఉంటే.. అంతే చెల్లించాలని తేగేసి చెప్పారు. విధివిధానాలు చెబుతామని అధికారులు అంటున్నా...వినుండా రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

వేపాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ ఆదేశించారు. పాటూరు, సోంపురం, సింగరాయి సచివాలయాలను ఎంపీడీఓ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. సకాలంలో విధులకు హజరై ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకు క్లోరినేషన్, శుభ్రం చేయించాలని సూచించారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు తడిపొడి చెత్త సేకరణకు రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలన్నారు. అనంతరం సోంపురం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్నాం. జిల్లాలో సుమారు రూ.400 కోట్లతో రహదారుల పనులు జరుగుతున్నాయి. కొఠియా గ్రూప్ గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నాం. అక్కడ కూడా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. గిరిజనులకు పట్టాలు అందిస్తాం. ఈ సంవత్సరం ఎంబీబీఎస్‌లో 12 మంది, ఐఐటీలో 20 మంది, ఎన్ఐటీలో 8 మంది గిరిజన విద్యార్థులు సీట్లు సాధించారు. సాలూరు ఏరియా ఆసుపత్రి పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తాం. వసతిగృహాలను అభివృద్ధి చేస్తున్నాం. మెగా డీఎస్సీలో పలు పోస్టులను గిరిజనులకు కేటాయించాం.' అని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోలు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నను కలిసిన టీడీపీ నాయకులు



మంత్రి అచ్చెన్నకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

పాలకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం పార్వతీపురం పర్యటనకు వెళ్లారు. ఈ మేరకు పాలకొండలోని ఏలాం జంక్షన్ వద్ద మంత్రిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి, కూటమి నాయకులు గండి రామినాయుడు, గుమ్మడి సింహాద్రి తదితరులు కలిసి, స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందించారు.

తోటపల్లి అభివృద్ధికి చర్యలు

గరుగుబిల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి శ్రీవేంకటేశ్వర, కోదండ రామస్వామి దేవస్థానాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. శుక్రవారం పార్వతీపురం పర్యటనకు వచ్చిన ఆయనకు దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు దేవస్థానాల పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. తోటపల్లికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయాన్ని అందిస్తామని మంత్రి తెలిపారు. జూలై 31న నిర్వహించనున్న వాన ప్రస్థాశ్రమ ప్రారంభానికి హాజరు కావాలని ఆలయ ప్రతినిధులు ఆయన్ని కోరారు. దేవ స్థానాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మంత్రిని కోరారు. తోటపల్లిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల పై లెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి డి.పారినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ఎం.సింహాచలంనాయుడు, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు పాల్గొన్నారు.

ఆటోబోల్తా.. పలువురికి గాయాలు

సీతంపేట రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పూతికవలస పంచాయతీ పుట్టిగాం గ్రామ సమీపంలోని మలుపు వద్ద శుక్రవారం ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం మండలం గాగలి గ్రామం నుంచి కొత్తూరు మండలం మెట్టూరు గ్రామానికి వెళ్తున్న ఆటో కొండ దిగువ ప్రాంతంలోని మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వీరన్న అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గ్రామస్థులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను అక్కడి నుంచి సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై సమాచారం అందలేదని ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు.

సూపర్-50 బ్యాచ్ ఎంపిక పరీక్ష విజయవంతం

పార్వతీపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూపర్-50 ప్రత్యేక బ్యాచ్ ఎంపిక పరీక్ష చాకలి బెలగాంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించామని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ పరీక్షల్లో మొత్తం 288 మంది విద్యార్థులు హాజరయ్యారని, సూపర్-50 బ్యాచ్ పథకంలో మార్కులు ప్రాతిపదికన ఎంపికైన 50 మంది బాలురకు, 50 మంది బాలికలకు వేర్వేరు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ తరగతుల ద్వారా విద్యార్థులకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. పరీక్ష అనంతరం తక్షణమే స్పాట్ వాలిడేషన్ నిర్వహించి ఎంపిక చేసి ఫలితాలను ప్రకటించారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

పాలకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పోలీస్‌స్టేషన్ సమీపంలో రక్తపు మడుగులో ఉన్న సాయినగర్ కాలనీకి చెందిన ఉదయ్ అనే వ్యక్తిని స్థానిక పోలీసులు ఆసుపత్రికి చేర్పించి, మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం రాత్రి పోలీసులు గస్తీ తిరుగుతున్న సమయంలో ఉదయ్ ద్విచక్ర వాహనంతో ఆవును ఢీకొని కిందపడి, తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయాలతో ఉన్న ఆయన్ని ఏఎస్ఐ నారాయణరావు, డ్రైవర్ దయాకర్ పోలీస్ వాహనంలో ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం ఉదయ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సీతానగరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. సూరంపేటలో సర్పంచ్ అప్పన్నమ్మ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి మురళీ చేయిస్తున్న పారిశుధ్య పనులు, ఇంటింటికీ పంపిణీ అవుతున్న కుళాయిల నీరు, కాలువల్లో పూడికతీత కార్యక్రమాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ముందుగా నీటి నాణ్యతను, ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద నీటిని పరిశీలించారు. స్వచ్ఛ జలాన్ని పంపిణీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్వాధీనం

సీతంపేట రూరల్, జూన్ 27(ఆంధ్ర జ్యోతి): మండలంలోని గాడిదపాయి గ్రామం లో దోనుబాయి ఎస్ఐ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల సారాతో బి.గణేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, శుక్రవారం కోర్టులో హాజ రు పరిచామని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పెంపు

రామభద్రపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో మరో 5 పోలింగ్ కేంద్రాలు పెంచినట్లు తహసీల్దార్ అజురపిజాన్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1200 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలు విడదీయాలని ఎన్నికల సంఘం నిబంధన విధించిందన్నారు. దీంతో మండలంలోని అదనంగా 600 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున మరో 5 అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 1200 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఉండడంతో ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నిబంధనలు అమలు చేసి ప్రతిపాదన వచ్చిందన్నారు. ఇందులో భాగంగా కొట్టక్కి, మిర్తివలస, మట్చర్లవలస గ్రామాల్లో ఒక్కొక్క పోలింగ్ కేంద్రం ఆరికతోటలో 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే మండలంలో శిథిలావస్థలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వాటికి మరమ్మతులు చేయిస్తామన్నారు. సమావేశంలో ఎన్నికల ఉప తహసీల్దార్ గౌరీశంకర్, టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయలు

బొబ్బిలి రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పారాది గ్రామం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పారాదికి చెందిన పల్ల అప్పలనాయుడు, సారిక అప్పలరాము బైకుపై మెట్టవలస నుంచి పారాది వైపు వెళ్తున్నారు. అదే సమయంలో గరివిడికి చెందిన ఎ.అప్పన్న, వై.రవిలు బైకుతో వెనుక నుంచి వచ్చి ఢీకొట్టారు. దీంతో బైకుపై వెనుక కూర్చున్న అప్పలరాము కింద పడి, తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు ఆ మహిళను అంబులెన్స్‌తో బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇలా అయితే రాకపోకలు ఎలా?

- బురదమయంగా కాలనీకి వెళ్లే దారి
- అవస్థలు పడుతున్న లబ్ధిదారులు



నెలిపర్తి కాలనీలో బురదమయమైన రోడ్డు

సాలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సాలూరు పట్టణవాసులకు సాలూరు మండలం నెలిపర్తి గ్రామం వద్ద పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. అయితే ఈ పేదల కాలనీలో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు అందని ద్రాక్షగా ఉన్నాయి. ఈ కాలనీలో 417 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. వారికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ కాలనీలో ఇప్పటి వరకు సుమారు 250మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. రోడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో ఇక్కడకు నివాసానికి రావడానికి పలువురు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటివరకు 30 కుటుంబాలు ఇక్కడకు వచ్చి నివశిస్తున్నాయి. ఈ కాలనీకి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డు బురదమయం అవ్వడంతో నరకయాతన పడుతున్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని సీపీఎం నాయకుడు మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: మంత్రి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

సాలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరులోని తన నివాసం వద్ద శుక్రవారం ఆమె ప్రజా దర్బార్ నిర్వహించారు. మున్సిపాల్టీలో ఎన్నో ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న తమకు జీతాలు పెంచాలని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు మంత్రిని కలిసి, వినతిపత్రం సమర్పించారు. కొంతమంది వివిధ వ్యక్తిగత సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.

క్షయ నివారణ విభాగంలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా జిల్లాలో క్షయ నివారణ విభాగంలో గల వైద్యాధికారి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, జిల్లా పీపీఎం కోఆర్డినేటర్, సీనియర్ టీబీ, హెచ్ఐవీ సూపర్‌వైజర్, అకౌంటెంట్ పోస్టుల కోసం ఒప్పంద పద్ధతిలో ఒక సంవత్సరం వరకు పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా వైద్యాధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను వైబ్‌సైట్‌లో పొందుపరిచిన ఫార్మేట్ ప్రకారం డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిచేసి రూ.200 డీడీతో కలిపి వచ్చే నెల రెండో తేదీ సాయంత్రం 4 గంటల లోపు పార్వతీపురం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి అందజేయాలని చెప్పారు.

సీఆర్టీల రెన్యువల్‌కు ఆదేశాలు

సీతంపేట రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 121మంది సీఆర్టీలకు కొనసాగించాలని (రెన్యువల్) తమకు ఆదేశాలు వచ్చినట్లు గిరిజన సంక్షేమ ఉప సంచాలకుడు అన్నదొర చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల అవసరం మేరకు సీఆర్టీలతో భర్తీ చేస్తామన్నారు. అలాగే ఐటీడీఏ పరిధిలోని పెద్దమడి, వెన్నెలవలస, బొమ్మిక, సీతంపేట ఏపీఆర్ గురుకుల బాలుర పాఠశాలలో పక్కా భవనాల నిర్మాణాలతో పాటు ఫర్నీచర్, మరమ్మతులకు గాను నిధులు మంజూరైనట్టు డీడీ తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఆ విధులను మినహాయించండి

వీరఘట్టం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్లతో పాటు ఉదయం ఆరు గంటలకు వెళ్లి ఫొటోలు తీసి, అప్లోడ్ చెయ్యాలనే విధుల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.వెంకటరమణకు వినతిపత్రం అందించారు. అదనపు విధులతో ఒత్తిడి పెరుగుతుందని, వాటి నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

ప్రలోభాలకు ఆశ పడొద్దు

- ఎమ్మెల్యే విజయచంద్ర
- టీడీపీ నాయకులతో సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణకు మారుపేరు అని కోటి రూపాయలు ఇచ్చినా ప్రలోభాలకు లొంగిపోరని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. నియోజకవర్గానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ కమిటీల నాయకులతో శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆర్ఎస్ఎస్, హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీలు మాదిరిగా కోట్లా ది రూపాయలతో ప్రతిపక్షాలు ఎన్నో ప్రలోభాలు పెట్టినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆశ పడరాదన్నారు. త్వరలో నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది కాలంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సి ఉందన్నారు. పార్టీ పరిశీలకుడిగా వచ్చిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పట్ల ప్రజల్లో ప్రత్యేక అభిమానం ఉందన్నారు. కురుపాం, పాలకొండ, సాలూరు పార్టీ పరిశీ లకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

బెలగాం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో ఆరోగ్య సమస్యలు, శారీరక, మానసిక లోపాలను చిన్నప్పుడే గుర్తించి తగిన చికిత్స అందించాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహనరావు అన్నారు. పట్టణంలోని చిల్డ్రన్ కేర్ హోంలో జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం (డీఈఐసీ) వైద్య బృందం పిల్లలకు నిర్వహించిన వైద్య పరీక్షలను ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. పిల్లల వైద్య నిపుణుడు భరత్‌చంద్ర వైద్య తనిఖీలు చేశారు. పుట్టుక ఎదుగుదల లోపాలు, వ్యాధులు, వైకల్యాలు సంబంధించిన లక్షణాలు ఏమైనా ఉన్నాయేమోనని పరీక్షలు చేశారు. ఈసందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా లోపాలు ఉన్న పిల్లలకు డీఈఐసీ కేంద్రంలో తగు చికిత్స అందించి, పర్యవేక్షిస్తారని చెప్పారు. గ్రహణం, మొర్రి(పెదవి చీలిక)కి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది సర్వే చేసి పిల్లల్లో ఇటువంటి సమస్యలను ముందుగానే గుర్తించి బాలలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్‌ను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భరత్ చంద్ర, సౌజన్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



పాచిపెంట: జీపు జాతా నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం రూపొందించిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నేత ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సీఐటీయూ చేపట్టిన జీపు యాత్ర శుక్రవారం మామిడిపల్లి చేరుకున్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారావు, మన్మథరావు, నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మక్కువ: వచ్చే నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు కోరారు. మక్కువలో శుక్రవారం జీపుజాతా నిర్వహించారు. సీఐటీయూ కార్యదర్శులు మన్మథరావు, ఎన్‌వై.నాయుడు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంటలో జీపు జాతా

పాచిపెంట: వచ్చే నెల 9న సమ్మె నిర్వహించనున్న నేపథ్యంలో పాచిపెంట, పణుకు వలసలలో శుక్రవారం జీపు జాతా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం హక్కులు కాపాడుకునేందుకు సమ్మె చేయనున్నామని తెలిపారు. సీఐటీయూ నాయకులు ఇంద్ర, రాము, మండల నాయకులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేని వ్యాపారులపై చర్యలేవీ?

జియ్యమ్మవలస, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా పత్తి, గడ్డి మందులు అమ్ముతున్న వ్యాపారులపై వ్యవసాయ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో రైతులకు జవాబు చెప్పాలని సీపీఎం కొమరాడ మండల నాయకుడు కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఇటువంటి వారి పట్ల మండల, గ్రామస్థాయి వ్యవసాయశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రస్తుతం పత్తి పంట ప్రారంభం అవుతున్న నేపథ్యంలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మడంతో పాటు నిషేధిత గడ్డి మందు ఎక్కువగా అమ్మడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఇకనైనా దీనిపై కచ్చితమైన చర్యలు తీసుకుని వ్యాపారుల ఆట కట్టించాలని డిమాండ్ చేశారు. పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాగునీరు సక్రమంగా అందేలా చూడండి

- మండల సమావేశంలో కోరిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

వీరఘట్టం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని అధికారులను కోరారు. సాగునీటి పారుదల శాఖ ఏఈ డీవీ రమణ మాట్లాడుతూ సాగునీటి కాలువల పూడికతీత పనులు నిర్వహిస్తున్నామని, షట్టర్లు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యవసాయశాఖ ఏఈ సౌజన్య మాట్లాడుతూ 869 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఎరువులు కూడా సక్రమంగా అందేలా చూస్తామన్నారు. పలువురు సభ్యులు భూ సమస్యలపై ప్రస్తావించగా, తహసీల్దార్ సాయికామేశ్వరరావు స్పందించి.. భూ సమస్యల పరిష్కారానికి అన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలో రీసర్వే చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు, విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీడీవో బి.వెంకటరమణ, జడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు విజయకుమారి, భార్గవ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రథయాత్ర ప్రారంభం

ఒడిశా

రాయగడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథ యాత్ర శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యింది. తొలుత జగన్నాథుని గర్భగుడిలోని జగన్నాథ, బలబద్ర, సుభద్ర దేవతామూర్తులకు పూజలు చేసి, రథంపై ప్రతిష్ఠించారు. అనంతరం రథాన్ని గుండిచా మందిరం వరకు లాగారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలకా, స్థానిక శాసనసభ్యుడు అప్పలస్వామి కద్రక, కలక్టర్ పారుల్ పట్వారి, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఉచితంగా మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న డీఎఫ్‌వో సచిన్

రాయగడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రథ యాత్రలో పాల్గొన్న భక్తులకు జిల్లా అటవీ శాఖ అధికారులు పలు పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో జిల్లా అటవీ శాఖాధికారి సచిన్ అన్నా సహెబ్ వహలే, రేంజర్ కామేశ్వర ఆచార్యులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు వచ్చి మొక్కలు తీసుకున్నారు.

న్యూస్ బాక్స్

రాష్ట్ర ప్రభుత్వంతో వీరేశ్ అవగాహన ఒప్పందం

కురుపాం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అరకులో వీఎస్‌కే హోటల్స్ అండ్ రిసార్ట్స్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ తెలిపారు. శుక్రవారం విజయవాడలో జరిగిన పర్యాటక సమావేశంలో టెక్ 2.0 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర పర్యాటక శాఖ మాత్రి కందుల దుర్గేష్ సమక్షంలో అవగాహన ఒప్పందం చేసుకున్నానని ఆయన స్థానిక విలేకర్లకు ఫోన్‌లో తెలిపారు.

పాచిపెంట ఎంఈవోగా రాజశేఖర్

సాలూరు రూరల్/పాచిపెంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట ఎంఈవోగా ఎం.రాజశేఖర్‌ను నియమిస్తూ ఆర్జేడీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

గరుగుబిల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లిలో శనివారం టీడీపీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

తీరిన విద్యుత్ సమస్య

సాలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు కనుమల్లో గిరిశిఖరాన ఉన్న గ్రామాల్లో విద్యుత్ సమస్య తీరింది. డెన్సరాయి, రేవడివలస, మర్రివలస, కాగురూఢి, సలపరబంద, గంద్రగొయ్యి, గొట్టిపాడు, వంకమామిడి తదితర గిరిశిఖర గ్రామాల్లో గత ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా లేదు. ఈ విషయం తెలిసిన ఏపీఈపీడీసీఎల్ ఏఈ నాగేశ్వరరావు తన సిబ్బందితో శుక్రవారం ఆయా గ్రామాలకు వెళ్లి, విద్యుత్ సరఫరా వచ్చేలా కృషి చేశారు.

ధ్రువపత్రాల కోసం నిరీక్షణ

మక్కువ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలు, పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాల కోసం విద్యార్థులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సకాలంలో ధ్రువపత్రాలు అందివ్వడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. రెవెన్యూ కార్యాలయానికి వెళితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. ఇంజనీరింగ్, ఇతర కోర్సుల ప్రవేశాలకు కౌన్సెలింగ్ తేదీలు సమీపిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సొంత నిధులతో వీధిలైట్లు ఏర్పాటు

మక్కువ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ నాయకుడు దాసరి కేశవరావు శుక్రవారం మక్కువ గ్రామంలోని పలు వీధుల్లో తన సొంత నిధులతో వీధిలైట్లను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా స్పందించలేదని, దీంతో సొంత నిధులతో లైట్లు ఏర్పాటు చేశానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా ప్రసాద్

సాలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా (పూర్తి అదనపు బాధ్యతలతో) బీవీ ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు శుక్రవారం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం ఆయన మున్సిపాల్టీలో డిప్యూటీ ఇంజనీర్‌గా ఉన్నారు.

కేదారిపురంలో 'గౌరవ వర్ష'

గుమ్మలక్ష్మీపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేదారిపురం గ్రామంలో ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో జన్ జాతీయ గౌరవ వర్ష కార్యక్ర మాన్ని శుక్రవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన పథకాలపై వివరించారు.